
## ఉపలోకాయుక్తగా డి.వీరప్ప

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉపలోకాయుక్తగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డి. వీరప్పను నియమించేందుకు గవర్నర్ గురువారం ఆమోదించారు. ఉపలోకాయుక్తగా వీరప్ప నియామకంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ప్రతిపక్షనేత అశోక్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నిలై విపిన్ చంద్ర అంజారియా, శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ప్రతిపాదించారు. సమష్టి నిర్ణయంతో అంగీకరించిన మేరకు గవర్నర్ ఆమోదం తెలిపారు. సుదీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న ఉపలోకాయుక్త ప్రక్రియ ఎట్టకేలకు సజావుగా జరిగింది.


బెంగళూరు నుంచి మైసూరు నైస్ రోడ్ ఇదే

# నైస్‌గా ఆదాయమే లక్ష్యం


- ప్రాజెక్టు స్వాధీనానికి ప్రభుత్వం కసరత్తు
- ఒకే కోర్టు పరిధిలోకి 80 కేసులు
- న్యాయ ప్రక్రియ వేగవంతం
- రైతులకు ఉపశమనం కలిగించేలా అడుగులు
- టోల్‌తో భారీ ఆదాయం

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏళ్ల తరబడి వివాదాల కేంద్రంగా కొనసాగిన బెంగళూరు - మైసూరు నంది ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ ఎంటర్ ప్రైజెస్ (నైస్) ప్రాజెక్టును స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఇందుకు న్యాయ ప్రక్రియను వేగవంతం చేసింది. భూస్వాధీన వివాదాలతో కలిపి ప్రాజెక్టుపై 80కు పైగా కేసులు ఉన్నాయి. వీటన్నిటిని ఒకే కోర్టు ముందుకు తీసుకొచ్చి త్వరితగతిన పరిష్కరించాలని, సదరు నైస్ ప్రాజెక్టును త్వరితగతిన స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి నైస్ కంపెనీకి వ్యతిరేకంగా ఆర్థిక అవినీతి, భూస్వాధీన ఆరోపణలతోపాటు మూల ఒప్పందాన్ని ఉల్లంఘించారని శాసనసభా కమిటీ ధ్రువీకరించింది. ఈ నివేదిక ఆధారంగా ఒప్పందాన్ని రద్దు చేసి ప్రాజెక్టు స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వానికి న్యాయశాఖ సలహా ఇచ్చింది. ఈ మేరకు మంత్రివర్గ ఉపకమిటీ సిఫారసులకు అనుగుణంగా దానిని దక్కించుకోదలిచారు. నైస్ కంపెనీ 30 ఏళ్ల కాంట్రాక్టు గడువు ముగుస్తున్న తరుణంలో ప్రభుత్వానికి మరో రకంగా అనుకూలమవుతోంది. కోట్లాదిరూపాయల వనరులను సమకూర్చుకునేందుకు ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తర్వాత పరిహారం విషయంలో కోర్టును ఆశ్రయించిన రైతులకు ఉపశమనం కల్పించేలా యోచిస్తున్నారు. గ్యారెంటీ పథకాలతో ఖజానా ఖాళీ అయ్యింది. ప్రత్యామ్నాయ ఆర్థిక వనరులపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో నైస్ ప్రాజెక్టు ఒకటి. రెవెన్యూ స్థలాలను సక్రమం ద్వారా జరిమానా, డెవలెప్‌మెంట్‌ట్యాక్స్ రూపంలో వేలాదికోట్ల రూపాయలు సేకరించదలిచారు. ఈ అంశంతోపాటు నైస్ ప్రాజెక్టుకు ఉపయోగించిన భూమి ప్రత్యేకంగా పెరిఫెరల్, లింక్ రోడ్ల అనుబంధమైన వేలాది ఎకరాల భూమిని ప్రభుత్వం భారీ వనరులకు మార్గదర్శకం కానుందనే అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టుకోసం స్వాధీనం చేసుకున్న వేలకోట్ల విలువైన ఆస్తి ప్రభుత్వ వశం కానుంది. దీనికితోడు కోట్లాదిరూపాయల టోల్ మొత్తం కూడా ఖజానాకు రానుంది. కేఐఏడీబీ చట్టం సెక్షన్ 3(1) కింద గెజిట్ అయ్యింది. సెక్షన్ 28(4) గెజిట్ ప్రకారం భూములు కోల్పోయిన రైతులు పరిహారం కోసం చేస్తున్న రైతుల పోరాటానికి న్యాయం చేయదలిచారు. బెంగళూరు - మైసూరు మధ్య 111 కిలోమీటర్ల ఎక్స్‌ప్రెస్ కారిడార్ 5 టౌన్‌షిప్‌లు, 41 కిలోమీటర్ల పెరిఫెరల్ రోడ్డు, 9.1 కిలోమీటర్ల లింక్ రోడ్లకు కలిపి ప్రాజెక్టుకు 26,485 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునేలా కేఐఏడీబీ గెజిట్ జారీ చేశారు. ప్రాజెక్టుకు 2,700 ఎకరాల భూమి అవసరం కాగా భారీస్థాయిలో భూసేకరణకు గెజిట్ విడుదల చేశారు. మొత్తం 13,406 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన భూమిని స్వాధీనం చేసుకునే విషయంలో వివాదాలు కొనసాగుతున్నాయి. 1997 ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం, నైస్ కంపెనీల మధ్య ఒప్పందం కుదిరింది. బెంగళూరు నగర శివారులో 64 కిలోమీటర్ల పొడవు టోల్‌రోడ్డుపైకి 49 కిలోమీటర్లు మాత్రమే అభివృద్ధి చేశారు. మిగిలిన ప్రగతి సాధ్యం కాలేదు. ప్రాజెక్టుపై అవినీతి ఆరోపణలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతంలో భూమి విలువ 5 -10 కోట్ల రూపాయల దాకా పలుకుతోంది. నైస్ ప్రాజెక్టును దక్కించుకోవాలని ప్రభుత్వం భారీ అంచనాలతో కసరత్తు చేస్తోంది.




# ముడాపై ఆరోపణలు రాజకీయ ప్రేరేపితం

- బీజేపీ నాయకులకు పనేమీ లేదు
- మా భూమికి పరిహారం కోరకూడదా..?
- స్థలాల పంపిణీ తప్పు అంటే రూ.62 కోట్లు పరిహారం ఇవ్వాలి
- సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మైసూరు అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ (ముడా)లో అవినీతి జరిగిందని బీజేపీ రాజకీయ ప్రేరేపిత ఆరోపణలు మినహా గణాంకాలపై స్పష్టత లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. గురువారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ వారికి మరేమీపని లేదని, ఆర్‌ఎస్‌ఎస్ సూచించినట్టు చేస్తారని అన్నారు. ముడాలో తమకు సంబంధించిన 3.16 ఎకరాల భూమిని ఇంటి స్థలాలకోసం తీసుకుంటే పరిహారం కోరకూడదా అని ప్రశ్నించారు. సుమారు రూ. 60 కోట్ల విలువైన భూమిని వదులుకోవాలా అంటూ ప్రశ్నించారు. తమ భూమిని స్వాధీనం చేసుకున్నట్టు వారు సభలో ఒప్పుకున్నారని, అందుకే 50:50 నిష్పత్తిన స్థలం ఇచ్చారని తెలిపారు. అందుకు తాము అంగీకరించామని, భూమి ఇవ్వాలని డిమాండ్ చేయలేదని అన్నారు. 2021లో అధికారంలో ఉన్న బీజేపీ స్థలాలు కేటాయించిందని, ప్రస్తుతం అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంటి స్థలాలు ఇవ్వడం తప్పు అంటే పరిహారం ఇప్పించాలన్నారు. తాము ఎక్కడా స్థలం ఇవ్వాలని కోరలేదన్నారు. 2023 అక్టోబరులో 50:50 నిష్పత్తితో భూమి కేటాయించడాన్ని రద్దు చేయాలని రాశారని, అలా చేయకపోయినా చట్ట ప్రకారం రూ. 62 కోట్ల పరిహారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 14 ప్లాట్లు ఇచ్చారని, అవి పరిహారమంత మొత్తం కాదన్నారు. మంత్రి భైరతి సురేశ్ ఇంటి స్థలాలకు సంబంధించి ఫైళ్లను బెంగళూరుకు తీసుకొచ్చారనేది అబద్ధమని కొట్టి పారేశారు. కేబినెట్‌లో ముడాపై వస్తున్న ఆరోపణలకు సీఎం సిద్దరామయ్య, సహచరమంత్రులకు సంపూర్ణ వివరాలు తెలిపారు. ఈనెల 15 నుంచి శాసనసభ సమావేశాలు ఉన్నందున ప్రతిపక్షాలు ఇదే అంశంపై రాద్ధాంతం చేసే అవకాశం ఉంటుందని, అందుకు మంత్రులు సమగ్ర వివరాలు తెలుసుకోవాలని సూచించారు. తాను ముఖ్యమంత్రిగా ఏడు కేసులను సీబీఐకు ఇచ్చానని, బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కటైనా ఇచ్చిందా...? అని నిలదీశారు. కేవలం రాజకీయాల కోసమే బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. హోంశాఖ మంత్రి పరమేశ్వర్ విధానసౌధలో మీడియాతో మాట్లాడుతూ అన్ని కేసులు సీబీఐకి ఇవ్వడం సాధ్యం కాదని తోసిపుచ్చారు. శాసనసభలో ఏ అంశాలపై చర్చిస్తుందో గమనిస్తామన్నారు. అందుకు ప్రతిపక్షాలు ఏ అంశంపై ప్రశ్నించినా సమాధానం ఇచ్చేందుకు తాము సిద్ధమన్నారు.

## ఎమ్మెల్యేలు, కార్యకర్తలకు సీఎం ప్రత్యేక సమయం

బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది ముగిసిన తరుణంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రజల్లోకి వెళ్లదలిచారు. ప్రతి గురువారం ఎమ్మెల్యేలతో భేటీకి నిర్ణయించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటలవరకు పార్టీలతో సంబంధం లేకుండా ఎమ్మెల్యేలను కలుస్తారు. నియోజకవర్గాల వారిగా వారి సమస్యలు, అత్యవసరాలు, ఇతరత్రా అంశాలపై చర్చించనున్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలంటే కార్యకర్తలు కీలకమని భావించిన సీఎం కొత్త విధానానికి సిద్ధమయ్యారు. పార్టీ అధికారంలో ఉన్నా తమను ఎవరూ పట్టించుకోలేదంటూ ఇటీవల లోక్‌సభ ఎన్నికల వేళ పలు ప్రాంతాలలో విమర్శలు వ్యక్తమైన తరుణంలో కేవలం కార్యకర్తలతో కలిసేందుకే సీఎం నిర్ణయించుకున్నారు. శనివారం కేపీసీసీలో మధ్యాహ్నం కార్యకర్తలకు సీఎం అందుబాటులో ఉంటారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కల్గినవారు మాత్రమే సీఎంను భేటీ అయ్యేందుకు అవకాశం ఉంటుంది. నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు ఇక్కడ అవకాశం ఉండదు. ప్రతి మంత్రి నెలకోసారి కేపీసీసీకి రావాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గం ఇటీవలే నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగానే సీఎం శనివారం కార్యకర్తలను కలిసేందుకు కేపీసీసీలో అందుబాటులో ఉంటారు.

## దర్శన్ కస్టడీ మరో 14 రోజుల పొడిగింపు



బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో జ్యూడిషియల్ కస్టడీలో ఉన్న నటుడు దర్శన్‌తో పాటు మరో 16 మందికి కస్టడీ గడువు పెంచుతూ కోర్టు ఆదేశించింది. దర్శన్, పవిత్రాగౌడ, ఇతర నిందితుల జ్యుడిషియల్ కస్టడీ గురువారంతో ముగియనుండటంతో విచారణలు జరుపుతున్న సిట్ అధికారులు ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచారు. నిందితుల కస్టడీ పొడిగించాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. నిందితులను నేరుగా కాకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు. కేసులో నిందితులు 13 మంది బెంగళూరు పరప్పన అగ్రహార జైలులో ఉండగా, నలుగురు తుమకూరు జిల్లా జైలులో ఉన్నారు. ఒకేసారి 17 మందిని వీడియో కాన్ఫరెన్స్ పద్ధతిలో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి జూలై 18వ తేదీ దాకా కస్టడీ పెంచుతూ తీర్పు ప్రకటించారు. కోర్టు తీర్పు ప్రకారం మరో 14 రోజుల పాటు దర్శన్‌తో పాటు బృందం జైలులోనే గడపాల్సి ఉంటుంది.

# కాంగ్రెస్ ఎంతకాలం ఉంటుందో..?

- తారస్థాయికి అంతర్గతపోరు
- గ్యారెంటీల పేరుతో మోసం
- కార్యవర్గ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర
- సత్తా ఉంటే ఎన్నికలకు రండి: యడియూరప్ప సవాల్

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి మరెంత కాలం ప్రాణం ఉంటుందోనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఎద్దేవా చేశారు. ప్యాలెస్ మైదానంలో గురువారం బీజేపీ రాష్ట్ర ప్రత్యేక కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన విజయేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పాపాలలో మునిగిపోయిందని విమర్శించారు. ప్రభుత్వానికి అస్థిరత వెంటాడుతోందన్నారు. అంతర్గత కలహాలు తారస్థాయికి చేరాయని అన్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం డీకే శివకుమార్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉపముఖ్యమంత్రి పదవుల కోసం ఏకంగా ఐదారుగురు బహిరంగంగానే మాట్లాడుతున్నారని అన్నారు. ఇండియా కూటమి అబద్ధాల ప్రచారంతో అధికారంలోకి వచ్చేందుకు చేసిన ప్రయత్నాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. అధికార దర్పంతో రాష్ట్రంలో 18-20 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారని గుర్తుచేశారు. గ్యారెంటీలతో మంచి చేస్తామని చెప్పుకుని అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ అన్ని చార్జీలు పెంచేందుకు సిద్ధమై సాధారణ కుటుంబీకులు జీవనం సాగించే పరిస్థితి లేకుండా చేశారని విమర్శించారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల అవినీతి చోటుచేసుకుందని పేర్కొన్నారు. ముడాలో ఏకంగా రూ.3వేల కోట్లకు పైగా అవినీతి జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ హిందువులను అవమానించారని అన్నారు. పార్టీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్ రాధామోహన్ దాస్ మాట్లాడుతూ 2023 శాసనసభ ఎన్నికల్లో ఓటమి చూశామని, ఏడాదిలోనే ప్రజలు బీజేపీ వైపే ఉన్నారనేది స్పష్టమైందని తెలిపారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య కుటుంబీకులు ముడా స్థలాల్లో భారీగా అవినీతికి పాల్పడ్డారని, సీఎం రాజీనామా కోరుతూ నిరసనలు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్‌నేత బీఎస్ యడియూరప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ- జేడీఎస్ కూటమి 19 లోక్‌సభ స్థానాలు గెలిచిందని, తద్వారా 142 అసెంబ్లీ స్థానాలలో విజయం బీజేపీ వైపే ఉన్నట్లు అన్నారు. సీఎం, డీసీఎం ఉండే 17 స్థానాలలో గెలుపు తమదే అన్నారు. గెలుస్తామనే సత్తా ఉంటే సీఎం సిద్దరామయ్య ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి ఎన్నికలకు వెళ్లాలని సవాల్ చేశారు. లోక్‌సభ ఎన్నికల వేళ తమ నుంచే కొన్ని తప్పిదాలు జరిగినందునే సీట్లు తగ్గాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందన్నారు. శాసనసభలో ప్రభుత్వ అవినీతి, వైఫల్యాలపై పోరాటం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పంచాయతీ, జిల్లా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



బీజేపీ కార్యవర్గ సమావేశం ప్రారంభంలో ముఖ్యనేతలు, హాజరైన పార్టీ ముఖ్యనాయకులు

# సరిహద్దులు ఇవేనా..?

- లీజుదారులను ప్రశ్నించిన సీఈసీ
- బళ్లారి పరిధిలో గనుల హద్దుల గుర్తింపునకు చర్యలు

బళ్లారి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్-కర్ణాటక సరిహద్దులో గనుల సరిహద్దులను గుర్తించేందుకు సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ (సీఈసీ) చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో లీజుదారులతో కలిసి గురువారం బళ్లారి జిల్లా పరిధిలోని గనుల ప్రాంతంలో పర్యటించింది. 'మీరు లీజ్ పొందిన ప్రాంతంలో అప్పట్లో ఉన్న సరిహద్దు రాళ్ల ఇవేనా..? అప్పుడు ఇప్పుడు ఇలాగే ఉన్నాయా.. లేదా..?' అని లీజుదారులను సీఈసీ విచారించింది. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ఏడు గనులను 1968లో కొందరు లీజుకు తీసుకున్నారు. బీఎంటీ, హెచ్‌టీ, ఎన్ఆర్, టీఎన్ఆర్, వీఎంపీసీ, ఎస్ఎంసీ, బీఎంసీ కంపెనీలు ఇక్కడ మైనింగ్ నిర్వహించేవి. ఇవన్నీ బళ్లారి జిల్లా భూభాగంలో ఉన్నాయి. రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం కారణంగా గనుల తవ్వకాలను నిలిపేశారు. ప్రస్తుతం రాష్ట్రాల సరిహద్దుల గుర్తింపు విషయం జోలికి వెళ్లకుండా, కర్ణాటక భూ భాగంలో ఉండే ఏడు గనులు సరిహద్దుల గుర్తింపునకు సీఈసీ సర్వే చేస్తోంది. నెల రోజుల క్రితం గనుల సరిహద్దుల పై సర్వే నిర్వహించింది. తాజాగా లీజుదారులను గనుల ప్రాంతంలోకి పిలిపించి.. గుర్తుల గురించి ఆరా తీసింది. సీఈసీకి నేతృత్వం వహిస్తున్న గోయల్‌తో పాటు కర్ణాటక, ఏపీ అటవీ శాఖ, గనుల శాఖ, రెవెన్యూ శాఖ, సర్వే లాండ్ రికార్డు శాఖ అధికారులు హాజరయ్యారు. కాగా, 1968లో ఇనుప గనులను రాష్ట్రాల సరిహద్దులో ఉండే గ్రామాల సరిహద్దుల ఆధారంగా మైనింగ్ లీజ్‌కు ఇచ్చారని లీజు దారులు అధికారులకు తెలిపారు. మైనింగ్ లీజ్ బౌండరీలు గుర్తించాలంటే రాష్ట్రాల సరిహద్దులు నిర్ధారణ కావాలని ఎన్.రత్నయ్య(ఎన్ఆర్), టీఎన్ఆర్ మైనింగ్ లీజుదారులు అధికారులకు వివరించారు. ఈ విషయంలో మరింత పురోగతి సాధించేందుకు మైనింగ్ లీజుదారులతో శుక్రవారం డోనిమలైలో సమావేశం నిర్వహించనున్నారు. సీఈసీ, రెండు రాష్ట్రాల అటవీ శాఖ, గనుల శాఖ, రెవెన్యూ శాఖ, సర్వే లాండ్ రికార్డ్స్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు. లీజు పొందిన ఏడు గనుల హక్కుదారులు రికార్డులతో హాజరు కావాలని సీఈసీ సూచించింది.



హెచ్ఎం మైనింగ్ ప్రాంతంలో రికార్డులను పరిశీలిస్తున్న సీఈసీ


సరిహద్దు రాళ్లను పరిశీలిస్తున్న అధికారుల బృందం

## ఆర్థిక కమిటీ సభ్యుడిగా కేంద్ర మంత్రి కుమారస్వామి



బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామికి మరో కీలకమైన బాధ్యతను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అప్పగించారు. కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ సభ్యుడిగా ఆయనకు అవకాశమిచ్చారు. రాష్ట్రంలో కుమారస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న జేడీఎస్ పార్టీ కేవలం రెండు స్థానాల్లోనే విజయం సాధించినా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంలో కీలకమైన ఆర్థిక వ్యవహారాల కమిటీ సభ్యుడిగా కుమారస్వామిని నియమించారు. కమిటీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా, భూఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ, వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాణ్, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్, వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్‌గోయల్‌తో పాటు పలువురు కీలకులు ఉన్నారు. బీజేపీకి చెందిన మంత్రులను మినహాయిస్తే జేడీఎస్‌కు చెందిన కుమారస్వామి, జేడీయూకు చెందిన లల్లన్‌సింగ్ మాత్రమే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఎనిమిది కమిటీలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చైర్మన్‌గా ఉంటారు. రాష్ట్రానికి చెందిన సీనియర్ మంత్రి ప్రహ్లాద్‌జోషి, కుమారస్వామి ఎనిమిది కమిటీలలోనూ స్థానం పొందారు.



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1,588.84 | 1,576.65 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 15,492 | 798 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 273 | 136 |
| సామర్థ్యం (టీఎంసీలు) | 10.09 | 3.06 |

## పచ్చదనాన్ని కాపాడటం మన బాధ్యత



మొక్కలు నాటుతున్న టీబీ బోర్డు సెక్రటరీ రామకృష్ణా రెడ్డి

**బళ్లారి గాంధీ నగర్, జూలై 4:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాలని తుంగభద్ర బోర్డు సెక్రటరీ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎల్లెల్సీ కాలువల పరిశీలనలో భాగంగా గురువారం ఆయన బోర్డు ఇంజనీయర్లతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఇప్పటి వరకు కాలువకు జరిగిన ఆధునీకరణ పనుల నిర్వహణ, కాలువపై నిర్మాణమైన అండర్ టన్నల్స్(యుటి)లు, డిస్ట్రిబ్యూటరీల నిర్వహణ, అత్యవసర సమయాల్లో ఉపయోగించే ఎస్కేప్‌లు, రెగ్యులేటరీల నిర్వహణపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా బాపురం వద్ద 146/700 కిలోమీటరు వద్ద కాలువ ప్రక్కనే మొక్కలు నాటి తనవంతుగా బాధ్యతను నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ శ్రీకాంత్ రెడ్డి, ఎల్లెల్సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ నీలకంఠా రెడ్డి, ఎస్‌డిఓ అమర్‌నాథ్ రెడ్డి, జ్ఞానేశ్వర్‌లతో పాటు పలువురు ఇంజనీయర్లు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో వైద్య ప్రవేశ పరీక్షలు

● ఏఐడీఎస్ఓ డిమాండ్




జిల్లాసుపత్రిలో నిరసన తెలుపుతున్న ఏఐడీఎస్ఓ

**బళ్లారి సిటీ,జూలై 4:** నీట్, నెట్, ఎన్‌టీఏను రద్దు చేసి రాష్ట్రస్థాయిలో వైద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని ఏఐడీఎస్ఓ కోరింది. నగరంలోని జిల్లాసుపత్రి ఆవరణలో గురువారం వందలాది మంది విద్యార్థుల నిరసనను ఉద్దేశించి ఏఐడీఎస్ఓ జిల్లాధ్యక్షుడు కే.ఈరన్న మాట్లాడుతూ, నీట్ యుజీ స్కామ్ వెలుగు చూసిన వెంటనే ఎన్‌టీఏ నిర్వహించిన నెట్ పరీక్షను విద్యా మంత్రిత్వ శాఖ రద్దు చేసిందని, పరీక్ష ముగిసిన మరుసటి రోజే ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఏళ్లతరబడి ఈ పరీక్షలకు సిద్ధమవుతున్నారన్నారు. నెట్ రీ ఎగ్జామినేషన్ తేదీని వెంటనే ప్రకటించాలని, యూజీసీ ద్వారా నేరుగా పరీక్ష నిర్వహించాలని, మెడికల్ ప్రవేశ పరీక్షను రాష్ట్రస్థాయిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నిరసన కార్యక్రమలో సంస్థ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.శాంతి, డా.ప్రమోద్‌కుమార్, కార్యాలయ కార్యదర్శి నిహారిక, కోశాధికారి అనుపమ, సభ్యులు వన్నూర్ స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

## 28న దొడ్డనగౌడ అవార్డుల ప్రదానం




మాట్లాడుతున్న ప్రభుకప్పగల్లు తదితరులు

**బళ్లారి సిటీ,జూలై 4:** ప్రముఖ తెలుగు, కన్నడ రంగస్థల కళాకారుడు, సాంస్కృతిక సార్వభౌమ జోళదరాశి దొడ్డనగౌడ జయంతి ఈనెల 27, 28 తేదీలలో రెండు రోజులపాటు రంగమందిరంలో నిర్వహిస్తున్నట్లు రంగతోరణ ప్రధాన కార్యదర్శి ప్రభుదేవ కప్పగల్లు తెలిపారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016లో జోలదరాశి దొడ్డనగౌడ రంగతోరణ పురస్కారం ప్రారంభమైందన్నారు. రాష్ట్రస్థాయిలో కళాకారులను ఈపురస్కారానికి ఎంపిక చేయడంతోపాటు దొడ్డనగౌడ జయంతి సందర్భంగా 28న పురస్కారప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈఏడాది రంగస్థలం. సాహిత్యం రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ప్రముఖ కళాకారుడు గురుప్పనవర్, ఉమ్మడి బళ్లారి జిల్లా మరియమ్మనహళ్ళికి చెందిన హనుమక్కను పురస్కారానికి ఎంపిక చేసినట్లు వివరించారు.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న మేయర్ నందీష్

● నూతన పరిపాలనా విధానానికి మేయర్ నందీష్ శ్రీకారం
● కార్పొరేటర్లు, అధికారులతో సమావేశం
● కార్పొరేషన్ పరిధిలో చేసే ప్రతి అభివృద్ధి పనికీ అనుమతులు పొందాల్సిందే
● ప్రజలకు అవసరం అయిన చోటే పనులు

# ఇకపై ప్రతివార్డులోనూ జనస్పందన

**బళ్లారి, జూలై 4(ఆంధ్రజ్యోతి):** ఇక నుంచి ప్రతి వార్డులో జనస్పందన కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మేయర్ ముల్లంగి నందీష్ బాబు తెలిపారు. నగర పాలికె కార్యాలయంలో గురువారం మేయర్ సమక్షంలో అధికారులు, కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతివార్డులో రెండు రోజుల పాటు జనస్పందన ఉండేలా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో ఉండే అధికారులు ఈ స్పందన కార్యక్రమంలో పాల్గొంటారని తక్షణం పరిష్కారం అయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు.

బళ్లారి నగర పాలికె పరిధిలో చేసే ప్రతి అభివృద్ధి పనికీ కార్పొరేషన్ అనుమతి పొందాలని, అలా కాకుండా ఇష్టారాజ్యంగా పనులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అధికారులను హెచ్చరించారు. నగర పాలికెలో మొత్తం 39 వార్డులున్నాయని, మొత్తం 16 ప్రభుత్వ శాఖలు ఇందులో పనిచేస్తున్నాయన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఎవరు ఏ పనిచేసినా నగర పాలికె పాలక మండలి అనుమతి పొందాలన్నారు. అలా కాకుండా అధికారులు ఇష్టారాజ్యంగా చేస్తే అటువంటి వారిపై పాలక మండలి చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే వార్డుల్లో సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. వార్డుల్లో పనులు చేసేటప్పుడు ఆవార్డు ప్రజాప్రతినిధులకు తెలపాలని వార్డు కార్పొరేటర్లను తెలియకుండా పనులు చేయరాదని అధికారులకు సూచించారు. పాలికె పరిధిలో చేసే పనులు మీటింగ్‌లో పెట్టి అనుమతి పొందిన తరువాత చేయాలని తెలిపారు. ప్రజల సౌలభ్యం కోసం పనులు చేయాలని అలా కాకుండా చేయడం మంచిది కాదని అధికారులకు సూచించారు.

అధికారులు కూడా పనులు గుర్తించే సమయంలో అక్కడ అత్యవసరంగా చేయాల్సిన పనులు, అలాగే ప్రజలకు అవసరం అయిన పనులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలికె పరిధిలో పనిచేసే వివిధశాఖల అధికారులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాయచూరు ఎస్పీగా పుట్టమాదయ్య



**రాయచూరు, జూలై 4 :** రాయచూరు జిల్లాకు నూతన ఎస్పీగా ఎం.పుట్టమాదయ్యను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల క్రితం ఇక్కడ ఎస్పీగా పని చేస్తున్న బి.నిఖిల్‌ను కోలార్‌కు బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో ఎం.నారాయణ స్వామి అనే ఐపీఎస్ అధికారిని జిల్లాకు కొత్త ఎస్పీగా బదిలీ చేస్తున్నట్టు ప్రకటించింది. కాని నారాయణస్వామి బదులుగా ఎం.పుట్టమాదయ్యను రాయచూరు ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. బెంగళూరులో రాష్ట్ర లోకాయుక్త ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీం అధికారిగా పని చేస్తున్న ఎం.పుట్టమాదయ్య జిల్లాకు కొత్త ఎస్పీగా రానున్నారు.

# అధికారుల తీరుపై భగ్గుమన్న మంత్రులు

● రాయచూరు జిల్లాలో రోడ్డు అభివృద్ధిపై సమావేశం



సమావేశమైన మంత్రులు భోసరాజు, శరణప్రకాశ్ పాటీల్

**రాయచూరు, జూలై 4 :** రాయచూరు జిల్లాలో ప్రధాన రహదారి విస్తరణ పనులకు సంబంధించి నిర్వహించిన సమావేశానికి సరైన సమాచారంతో రాని అధికారుల పై మంత్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూరులో గురువారం నిర్వహించిన ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశానికి రాయచూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటీల్ అధ్యక్షత వహించగా జిల్లాకు చెందిన చిన్ననీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు, ఎంపీ జీ కుమార్ నాయక్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సింధనూరు నుంచి కల్మలా క్రాస్ వరకు 80 కీ.మీ రహదారిని నాలుగు లైన్‌లుగా విస్తరించే అంశానికి సంబంధించి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అధికారులు ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించి ఎలాంటి సమాచారాన్ని స్పష్టంగా చెప్పకపోవడంతో మంత్రులిద్దరూ అధికారులను తీవ్రంగా మందలించారు. ఈ రోడ్డును రూ.1,685 కోట్లతో నాలుగు లైన్‌లుగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఎదు రయ్యే సమస్యలు తదితర వాటిపై సమగ్రంగా నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. తదనంతరం నిర్వహించే సభకు పూర్తి సమాచారంతో రావాలని అధికారులను మంత్రులిద్దరు ఖరాఖండిగా హెచ్చరించారు.

# ఉత్సాహంగా మట్టెద్దుల అమావాస్య



మట్టి ఎద్దులను కొనుగోలు చేస్తున్న ప్రజలు

**రాయచూరు, జూలై 4 :** రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వచ్చే మట్టెద్దుల అమావాస్యను శుక్రవారం జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జేష్ఠబహుళ అమావాస్యను మట్టెద్దుల అమావాస్యగా జరుపుకునే ప్రజలు ఈ సందర్భంగా మట్టితో తయారు చేసిన జోడెద్దులను పూజించి వాటిని ఊరేగించడం ఆనవాయితీ. ఇదే రోజు కాడెద్దులను సహితం ఊరేగిస్తున్న రైతులు ఈ పండుగకున్న ప్రత్యేకతను చాటిచెబుతారు. కాగా మట్టెద్దుల అమావాస్యసందర్భంగా ప్రతి ఇంట్లోను మట్టి ఎద్దులను ప్రత్యేకంగా పూజించడం ఆనవాయితీ కావడంతో వాటిని తయారు చేసే వారు పెద్ద ఎత్తున రెండు రోజుల నుంచే మట్టిని సేకరించి రంగురంగుల రూపాలు వివిధ ఆకారాలు, ఆకృతుల్లో మట్టి ఎద్దులను తయారు చేసి ఉంచారు. మట్టి ఎద్దులను కొనుగోలు చేసేందుకు ప్రజలు సైతం పెద్ద సంఖ్యలో స్థానిక కుంబార వీధిలో కనిపించారు.

# గిణగేరా, మహబూబ్ నగర్ / రైలు మార్గాన్ని పూర్తి చేయాలి

● రైల్వే మంత్రి సోమణ్ణకు బాబురావ్ వినతి



ఏడీసీ దుర్గేష్ ద్వారా మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న బాబురావ్

**రాయచూరు, జూలై 4 :** ఏళ్ల తరబడి నత్తనడకన సాగుతున్న గిణగేరా-రాయచూరు, మహబూబ్ నగర్ రైల్వే లైన్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణీకులకు సౌకర్యం కల్పించాలని రైల్వే సలహా సమితి మాజీ సభ్యుడు బాబురావ్ కోరారు. గురువారం కేంద్ర రైల్వే మంత్రి సోమణ్ణకు రాసిన వినతి పత్రాన్ని రాయచూరు ఏడీసీ దుర్గేష్‌కు ఆయన వినతి పత్రంగా అందజేశారు. 1998లో ప్రతిపాదనలతో సిద్ధమైన ఈ మార్గం పనులు ఇప్పటి వరకు కొనసాగుతుండడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గిణగేరా నుంచి సింధనూరు వరకు రైలు మార్గం పూర్తై ఇప్పటికే రైళ్ల సంచారం సాగుతుండగా సింధనూరు నుంచి రాయచూరు వరకు మాత్రం పనులు పెండింగ్‌లో ఉండడం ప్రయాణీకుల పాలిట శాపంగా మారిందన్నారు. రాయచూరు నుంచి ఇప్పటికే మహబూబ్ నగర్ వరకు రైల్వేలైన్ నిర్మాణం పూర్తయినందున సింధనూరు నుంచి రాయచూరు వరకు గల మార్గాన్ని సత్వరం పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుని ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యం కల్పించాలన్నారు. ఈ మార్గం పూర్తయితే ఉత్తర కర్ణాటక ప్రజలతో పాటు దావణగెరె తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలకు నేరుగా హైదరాబాద్‌కు ప్రయాణసౌకర్యం మరింత సులభతరం అవుతుందని ఈ మార్గాన్ని సత్వరం పూర్తి చేయాలని కోరారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**హోసూరు జూలై 4:** హోసూరు సబ్ స్టేషన్‌లో అవసరమైన విద్యుత్ పరికరాల నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుమార్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. శనివారం 9 గంటల నుంచి 5 గంటల వరకు గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. హోసూరు సబ్ స్టేషన్ పరిధిలోని టీవీఎస్ నగర్, అందివాడి, మత్తిగిరి, టైటాన్ టౌన్‌షిప్, గాడిపాళ్యం, కుదురే పాళ్య, పాత మత్తిగిరి, యడేనల్లూరు, శివకుమార్ నగర్, కొత్తూరు, కొతకొండపల్లి, బొమ్మండపల్లి, మునీశ్వర నగర్, ద్వారక నగర్, న్యూ హడ్కో మహాలక్ష్మీ నగర్, పార్ట్ 2 రాంనగర్ , బస్టాండ్, శ్రీనగర్, అప్పావు నగర్, కామరాజ్ కాలనీ, అన్నా నగర్, టైటాన్ ఇండస్ట్రీస్, అశోక్ లైలాండ్, సిప్‌కాట్ హౌసింగ్ కాలనీ , నేతాజీ నగర్, బాలాజీ నగర్, చిన్నయళసగిరి , ఆనంద నగర్, శాంతపురం, అరసనట్టి, ఎన్‌జీజీఓఎస్ కాలనీ, కే.సి.సి నగర్, సూర్య నగర్, బృందావన్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఓటరు జాబితా విడుదల



ఓటరు జాబితాను విడుదల చేస్తున్న అధ్యక్షుడు రాజారెడ్డి

**సిరుగుప్ప, జూలై 4 :** సిరుగుప్ప ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి పదాధికారులను ఎన్నుకోవడం కోసం గురువారం నూతన ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిరుగుప్ప తాలుకా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లింగ రాజారెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగుల సంఘం ఓటరు జాబితాలో పేరులేకుంటే చేర్చేందుకు పది రోజుల పాటు గడువు వుంటుందని తెలిపారు. తాలుకాలోని అన్ని శాఖలలో 1170 మంది ఉద్యోగులు సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆగస్టు నెలలో సంఘానికి ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఉద్యోగులకు సహకార సంఘం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సహకార సంఘం వలన ఉద్యోగులు ఆర్థిక సమస్యలను పరిష్కరించుకోవడానికి సాధ్యపడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాజ్య కార్యదర్శి రాజాబక్షి, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు శ్రీధర, తాలుకా సంఘటన కార్యదర్శి వెంకటేష్, నామినేటెడ్ సభ్యులు సిద్దప్ప, విద్యాశాఖ మహేంద్ర పటేల్, భీమేష్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

## సమయానికి బస్సు నడపాలి



యూనిట్ మేనేజర్‌ను చుట్టుముట్టిన విద్యార్థినులు

**బళ్లారి సిటీ, జూలై 4:** సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కుమారస్వామి, సౌమ్య కేఎస్ఆర్‌టీసీ మేనేజర్‌ను కోరారు. సండూర్ తాలూకాలోని జోగ,తాళూరు, గంగాళాపూర్ విద్యార్థినులు గురువారం యూనిట్ మేనేజర్ వద్దకు వెళ్లి ఆయనతో మాట్లాడారు. నిత్యం బస్సు ఆలస్యంగా వస్తోందని ఇందువలన పాఠశాలకు వెళ్ళేందుకు ఆలస్యం అవుతోందని తెలిపారు. సమయానికి బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థుల ఇబ్బందులను అరికట్టాలని కోరారు. యూనిట్ మేనేజర్ హరికృష్ణ స్పందిస్తూ తారానగర్ విద్యార్థులు బస్సును అడ్డుకోవడంతో సమయానికి రావడం ఆలస్యమైందని ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్న రోజుల్లో సరైన సమయానికి బస్సు ఏర్పాటు చేస్తామన్నారు.

# హోసూరు జోన్

## కల్తీ ఆహార పదార్థాల ధ్వంసం



ఆకస్మిక తనిఖీలు చేస్తున్న ఆహార భద్రతా అధికారులు

**హోసూరు జూలై 4:** కెలమంగళం ఫుడ్ సేఫ్టీ అధికారి ముత్తుమారియప్పన్, కెలమంగలం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం జిల్లా వైద్యాధికారి రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం కెలమంగలం బస్‌స్టేషన్ , మెయిన్ బజార్, పరిసర ప్రాంతాల హోటళ్లలో, బేకరీలలో, పానీపూరీ దుకాణాలలో, మటన్ దుకాణాలల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 12 కిలోల పాడైన చికెన్, మటన్, చేపలు, ఆహార పదార్థాలు, 9 కిలోల పాడైన తినుబండారాలు, 12 కిలోల కూల్ డ్రింక్‌లు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారి అనుమానం వచ్చిన పానీపూరీ షాపుల నుంచి ఫుడ్ శాంపిల్స్ తీసుకుని పరీక్షలకు పంపారు. వ్యాపారులకు రూ.15 వేలు జరిమానా విధించి ఫిర్యాదులను పరిష్కరించాలని హెచ్చరిక నోటీసు జారీ చేశారు. అలాగే ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న హోటళ్లు, బేకరీలు, రిసార్ట్‌లు, లగ్జరీ హోటళ్లు, ఆహార సంస్థలపై ఫుడ్ సేఫ్టీ అండ్ కలర్స్ యాక్ట్ 2006 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ముత్తుమారియప్పన్ హెచ్చరించారు. కెలమంగలం జిల్లా ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మిపతి, ఆరోగ్య పర్యవేక్షలులు కార్తీక్ శివగురునాథన్, జే.మురుగేశన్, మున్సిపాలీటి శానిటేషన్ సూపర్‌వైజర్ నాగేంద్రన్ పాల్గొన్నారు.

## డెంగీ వ్యాపించకుండా చర్యలు చేపట్టాలి

**హోసూరు(సిప్‌కాట్) జూలై 4:** కృష్ణగిరి జిల్లాలో డెంగీ జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉన్నందున నివారణ చర్యలు ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా డెంగీ జ్వరం వేగంగా విస్తరిస్తోంది. గత జనవరి నుంచి ఇప్పటి వరకు 6 వేల మందికిపైగా డెంగ్యూ జ్వరాలు సోకాయి. కర్ణాటకలో డెంగీ జ్వరం కారణంగా గడిచిన నెల రోజుల్లో వెయ్యి మందికి పైగా ఆసుపత్రుల్లో చికిత్స పొందగా ఏడుగురు మృతి చెందినట్లు సమాచారం ఈ నేపథ్యంలో అక్కడ నివారణ చర్యలు ముమ్మరం చేశారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకకు, అక్కడి నుంచి తమిళనాడుకు రోజూ వేలాది మంది రాకపోకలు జరుపుతుంటారు. ముఖ్యంగా పనుల నిమిత్తం అత్తిపల్లి, చందాపురం, బొమ్మనహళ్లి, తో పాటు వివిధ ప్రాంతాలకు తమిళనాడు నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వెళ్తుంటారు. కావున రాష్ట్ర సరిహద్దులో ఉన్న హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జూజూవాడీ చెక్ పోస్టు వద్ద డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టా ప్రజలకు పరీక్షలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

## భవన నిర్మాణ పనుల పరిశీలన

**హోసూరు(కృష్ణగిరి) జూలై 4:** కృష్ణగిరి జిల్లా అలపట్టి, నెడుంగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు , కృష్ణగిరి ప్రభుత్వ బాలికల కళాశాల, అదనపు భవన నిర్మాణ పనులు విద్యార్థి వసతి గృహాల నిర్మాణ పనులను కలెక్టర్ గురువారం స్వయంగా పరిశీలించారు. కృష్ణగిరి సర్కిల్ , అళ్లపట్టి ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాల ఆవరణలో రూ.కోటి 69 లక్షలతో ప్రాజెక్టు క్రింద నిర్మిస్తున్న అదనపు భవన నిర్మాణ పనులను జిల్లా పాలనాధికారి స్వయంగా పరిశీలించి ఒక్కో తరగతి గది పరిమాణం, మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు.



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సరయు

# లవర్స్ స్పాట్‌గా కన్నడ భవన్ కాంపౌండ్..!

● ఈసడించుకుంటున్న స్థానికులు ● అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

**రాయచూరు, జూలై 4 :** నగరంలోని పండిత్ సిద్ధ రామ్ జంబలదిన్ని రంగమందిర్ వెనకభాగంలో ఉన్న కన్నడ భవన్ అపహాస్యం పాలయ్యే పరిస్థితి తలెత్తింది. కన్నడ భవన్ సమీపంలో పలు దేవాలయాలతో పాటు కల్యాణ మంటపాలు కూడా ఉండగా ఈ ప్రాంతంలో జన సంచారం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇలా ఉండగా కన్నడ భవన్ కాంపౌండ్ పై కూర్చుంటున్న కొంతమంది ప్రేమికులు రొమాన్స్ చేస్తూ చూపరులకు విసుగు తెప్పిస్తున్నారు. ఇరుగు-పొరుగు ఇళ్లవారు సహితం ఈ రొమాన్స్ సన్నివేశాలను నిత్యం గమనించడం తమవల్ల కాదంటూ ఈసడించుకుంటున్నారు. అక్కడ పని చేసే మహిళా కూలీలు ఈ రొమాన్స్ వెకిలి చేష్టలను చూడలేక పోతున్నామని తప్పని పరిస్థితుల్లో తామ విధులు తాము నిర్వహిస్తున్నామని కళ్లు మూసుకుని ఇవన్నీ చేయాల్సి వస్తుందంటూ వాపోతున్నారు. కాగా కొంత మంది ప్రేమికులు కాంపౌండ్ వాల్ పై కూర్చుని పరస్పరం ముద్దాడుకుంటూ తమలోకంలో తాము మైమరిచిపోయి ఉండడం నిత్యకృత్యంగా మారింది. లోకమంతా తమను చూస్తుందన్న జ్ఞానం కూడా లేదంటూ కొంతమంది బహిరంగంగానే వారిని తిడుతున్నారు. గురువారం రెండు ప్రేమ జంటలను చెడామడా వాయించడంతో అక్కడి నుంచి లేచి పరారయ్యారని ఇంకోసారి ఇలా కనిపిస్తే జాగ్రత్త! అంటూ హెచ్చరించామని స్థానికులు చెబుతున్నారు. కొందరు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## వ్యాపారి కిడ్నాప్ కేసులో 9 మంది అరెస్టు

**చెన్నై, జూలై 4(ఆంధ్రజ్యోతి):** స్థానిక పల్లావరంలో పది రోజుల క్రితం జరిగిన మందుల వ్యాపారి కిడ్నాప్ కేసులో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. పల్లావరం సమీపం తిరుముడివాక్కం ప్రాంతంలో అజారుద్దీన్ అనే మందుల వ్యాపారి నివసిస్తున్నాడు. జూన్ 22 రాత్రి ఆయన బైకుపై తిరుముడివాక్కం మెయిన్‌రోడ్డులో వెళ్తుండగా కారులో వచ్చిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తాము పోలీసులమని చెప్పి, బలవంతంగా కారులో ఎక్కించుకునేందుకు ప్రయత్నించారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో అజారుద్దీన్ కారులో ఎక్కేందుకు నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన ఆ దుండగులు ఆయనను చితకబాది, సంకెళ్లు వేసి బలవంతంగా కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్ళారు. కారులో రాత్రంతా ఆయనను పలు ప్రాంతాలకు తిప్పి క్రెడిట్‌కార్డులు, డెబిట్ కార్డులు లాక్కుని వాటి పాస్‌వర్డ్ తెలుసుకుని ఏటీఎంలలో నగదును, సెల్‌ఫోన్ ద్వారా వేలాది రూపాయలను బదిలీ చేసుకున్నారు. మరుసటి రోజు ఉదయం అజారుద్దీన్‌ను ఆర్కాడు ప్రాంతంలో దించి పారిపోయారు. ఈ నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీన మళ్ళీ ఆ కిడ్నాప్ ముఠా ఆయనకు ఫోన్ చేసి తాము తెలిపే చోటుకు డబ్బు తీసుకురమ్మంటూ బెదిరించారు. దీంతో అజారుద్దీన్ శంకర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి అజారుద్దీన్ సెల్‌ఫోన్‌లో నమోదైన ఫోన్ నెంబర్ల ఆధారంగా కుండ్రత్తూరు కొలచ్చేరి ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్, పెరుంబాక్కంకు చెందిన కార్మేగం, కాంచీపురానికి చెందిన సదామ్, కుండ్రత్తూరు ఆంటోని, రాజ్, పమ్మల్ మహమ్మద్ రఫీ, పల్లావరం ఇమ్రాన్, జమీన్‌పల్లావరానికి చెందిన వేలు ముఠాను అరెస్టు చేసి వారి నుంచి వాకీటాకీలు, తుపాకీ, సంకెళ్లు, సెల్‌ఫోన్‌లు, కిడ్నాప్‌కు ఉపయోగించిన కారు స్వాధీనం చేసుకున్నారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

### పీవీ సింధు (పుట్టినరోజు)



ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పూసర్ల వెంకట సింధు 1995 జూలై 5న హైదరాబాద్‌లో జన్మించారు. 2013లో చైనాలో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య నిర్వహించిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన తొలి భారతీయురాలు. 2016లో రియో ఒలింపిక్స్ క్రీడల్లో రజతపతకం సాధించడం ద్వారా ఒలింపిక్ పోటీల్లో రజతపతకం సాధించిన తొలి భారతీయ మహిళగా రికార్డు సృష్టించారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుపొందారు. 2021 సెప్టెంబరు 21న అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య ప్రకటించిన స్థానాల్లో మొదటి 20 క్రీడాకారిణుల జాబితాలో చోటు దక్కించుకోవడంతో సింధుకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. రాజీవ్‌ఖేల్‌రత్న, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలతోపాటు అర్జున అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు.

# భారీ వర్షాలు.. విరిగిపడ్డ కొండ చరియలు

● కూలిన విద్యుత్ స్తంభాలు.. వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి ● కారవార - బెంగళూరు జాతీయ రహదారి బంద్..





కారవార మార్గంలో రోడ్డుపై కుప్పకూలిన కొండ చరియలు, సాగర తాలూకాలో నేలకూలిన విద్యుత్‌స్తంభాలు, ఉడుపి జిల్లాలో ఈదురుగాలులకు ఎగిరి పడుతున్న సామగ్రి

**బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి):** తీరప్రాంత జిల్లాల్లో భారీ గాలులు, వర్షాల ప్రభావం కొనసాగుతోంది. వరుణుడి ధాటికి పలు అవాంతరాలు చోటు చేసుకుంటున్నాయి. ఉత్తరకన్నడ జిల్లా హొన్నావర తాలూకా వర్గకేరి గ్రామం వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. రోడ్డుపై మట్టి, రాళ్లుపడ్డంతో బెంగళూరు - కారవార జాతీయ రహదారిని తాత్కాలికంగా బంద్ చేశారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఉత్తరకన్నడ జిల్లా కారవార ప్రాంతంలో వాగులోకి బస్సు ఇరుక్కుపోవడంతో జనం బెంబేలెత్తారు. ఎటువంటి ప్రమాదం లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. తీరప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కొనసాగుతుండడంతో ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించారు. మరో నాలుగైదు రోజులు వర్షం ఉంటుందని వాతావరణ పరిశోధన శాఖ ప్రకటించింది. మలెనాడు ప్రాంతంలోనూ ఈ ప్రభావం ఉంటుందని తెలిపింది. ఉడుపి జిల్లా కుందాపురలో వర్షాల తాకిడికి 5వేలకుపైగా వక్కచెట్లకు నష్టం వాటిల్లింది. విధానపరిషత్ మాజీ సభాపతి, ఉడుపి జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు ప్రతాప్‌చంద్రశెట్టి గురువారం కుళ్లంజె, రత్తాడి ప్రాంతాలను పరిశీలించారు. హొసనగర భైరసా గ్రామంలో కాలువ దాటుతుండగా చీకళి గ్రామానికి చెందిన శశికళ (43) కొట్టుకుపోయారు. ఉడుపి, దక్షిణకన్నడ జిల్లాల వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. శివమొగ్గ జిల్లా సాగర తాలూకాలో పలు చోట్ల విద్యుత్‌స్తంభాలు తెగిపడ్డంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలుల ప్రభావం తీవ్రంగా ఉండడంతో పంటనష్టంతోపాటు ఇళ్ల పైకప్పులు దెబ్బతిన్నాయి. ఉడుపిలో భారీ వర్షాలతో బైందూరు తాలూకా కొల్లూరు గ్రామంలో మట్టి చరియలు విరిగిపడి అందులో ఇరుక్కున్న హళ్ళిబేరు నివాసి అంబా (45) మృతి చెందారు.

## యువరాజ్ విడాకుల కేసు ఆగస్టు 23కు వాయిదా

**బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి):** ప్రముఖ నటుడు రాఘవేంద్రరాజ్‌కుమార్ కుమారుడు యువరాజ్, అతడి భార్య శ్రీదేవి విడాకుల పిటీషన్‌ను ఫ్యామిలీ కోర్టు ఆగస్టు 23కు వాయిదా వేసింది. యువరాజ్ దాంపత్యంలో విభేదాలు తలెత్తడంతో భార్యకు విడాకులు ఇవ్వాలని దాఖలు చేసుకున్న పిటీషన్‌పై గురువారం విచారణ జరిగింది. యువరాజ్ భార్యకు వ్యతిరేకంగా గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు చేశారు. మానసికంగా వేధిస్తున్నారని పిటీషన్‌లో పేర్కొన్నారు. కాగా యువరాజ్ భార్య శ్రీదేవి భైరప్ప ఇటీవల కొంతకాలంగా అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లారు. ఇటీవల బెంగళూరుకు వెనుతిరిగి వచ్చినా గురువారం అమెరికాకు బయలుదేరారు. ఈ మేరకు శ్రీదేవి ఎక్స్ ద్వారా సుదీర్ఘమైన పోస్టింగ్ చేశారు. 15రోజులుగా కర్ణాటకలో తాను కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నవేళ తన వ్యక్తిగత జీవనానికి గౌరవం కలిగించేలా సున్నితమైన అంశం పట్ల బాధ్యతతో వ్యవహరించిన మీడియా ప్రతినిధులకు హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ పోస్టు చేశారు. కొన్నేళ్లుగా తనతో కలిసి ఉండే మిత్రులు కొందరు అబద్ధాలను నమ్మారని విచారం వ్యక్తం చేశారు. తనకు ధైర్యం కలిగించేలా కుటుంబీకులు, మిత్రులు బంధువులు, సినిమారంగానికి చెందిన పలువురు వ్యవహరించారని పోస్టు చేశారు.

## రంగమంచ్‌లో సరదాగా గడిపిన వృద్ధులు

**బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి):** మల్లేశ్వరంలోని మణిపాల్ ఆసుపత్రి, సీనియర్ సెంట్రల్‌తో కలిపి వృద్ధులకోసం 'రంగమంచ్' పేరిట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఏర్పాటైన కార్యక్రమంలో 200 మందికిపైగా సీనియర్ సిటిజన్‌లు భాగస్వామ్యులయ్యారు. సంగీతం, నృత్యం, ఫ్యాషన్ షో వంటి కార్యక్రమాల్లో సరదాగా పాల్గొన్నారు. డాక్టర్ రాజ్‌కుమార్ మనవరాలు, నటి, మోడల్ సంధ్యా రామకుమార్, మణిపాల్ డైరెక్టర్ నిరంజన్‌రై, రీజనల్ హెడ్ భావనా బద్రినారాయణ పాల్గొన్నారు. నిరంజన్‌రై మాట్లాడుతూ సీనియర్ సిటిజన్‌లు వయోభారం సమస్యలతోపాటు ఇతరత్రా ఆరోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటారని, వారు సరదాగా గడపాలనే ఉద్దేశ్యంతో రంగమంచ్ ఏర్పాటు చేశామన్నారు. సీనియర్ కేర్ ప్రోగ్రామ్ పేరిట సీనియర్ నైబర్‌హుడ్ హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించామన్నారు. అపాయింట్‌మెంట్‌లతోపాటు ఇతరత్రా సౌలభ్యాలు పొందవచ్చు అన్నారు.

## 'చాణక్య'లో అంతర్జాతీయ సంబంధాలపై పీఠం

**బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని చాణక్య విశ్వవిద్యాలయంలో చట్ట, పాలనాపరమైన విధానాలకు సంబంధించి సుభాష్‌చంద్రబోస్ అంతర్జాతీయ సంబంధాల పీఠాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇటీవల నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కృతిని విస్తరించే అంశాల, అంతర్జాతీయ సంబంధాలకు భారతీయ పథం అనే అంశంపై అధ్యయనానికి ప్రత్యేకంగా చర్చించారు. ప్రస్తుతం పీఠం మూడు అంశాలపై లక్ష్యం కలిగి ఉంది. గుణాత్మకమైన పరిశోధనలు, పాఠకులు, పరిశోధనలపట్ల ఆసక్తి కల్గించేలా పెంపొందించడం, సముదాయ భాగస్వామ్యం క్రియాశీలకం చేయడం ఉన్నాయి. పీఠంలో పీఎస్ రాఘవన్ అధ్యక్షతన ఎన్ పార్థసారథి, విజయ్‌గోఖలె, పంకజ్ సరన్, డీబీ వెంకటేశ్ వర్మా, ప్రొఫెసర్ హర్ష్‌పంత్, ప్రొఫెసర్ మంజరి చటర్జి మిల్లర్‌లతో కూడిన సభ్యులు ఉంటారు. 13 మంది మేధావులు, నిపుణులు, ప్రముఖ పరిశోధకులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

## ఆముదం పంటతో అధిక లాభాలు

### ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు

**బుక్కరాయసముద్రం, జూలై 4:** ఉమ్మడి జిల్లాలో మెట్ట సాగులో వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా ఆముదం పంట దిట్ట అని రేకలకుంట ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రేకలకుంటలోని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కార్యాలయంలో ఆముదం (సంకర రకం ఐసీహెచ్) విత్తనాలతోపాటు సైకిల్ వీడర్, వ్యవసాయ ఉపకరణాలు పలువురు రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వేరుశనగ పంట అధికంగా సాగు చేస్తున్నారన్నారు. సకాలంలో వర్షాలు రాకపోతే.. తీవ్ర నష్టం తప్పదన్నారు. ఆముదం పంట అయితే మెట్ట పంటలో కొంచెం వర్షం తక్కువైనా పంట చేతికి వస్తుందన్నారు. రైతులు పంట మార్పిడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యవసాయంలో మెలకువలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఆముదం సాగులో తక్కు. వ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త దుర్గాప్రసాద్, గుత్తానారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

**అనంతపురం విద్య, జూలై 4:** నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లాలో విజయవంతమైంది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. బంద్ సందర్భంగా విద్యార్థి సంఘాలు నగరంలో ర్యాలీ నిర్వహించాయి. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, జేఎన్‌టీయూలో సైతం బంద్ చేయించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షలను తక్షణమే రద్దు చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం కూడా నీట్‌పై కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కుల్లాయిస్వామి, పరమేష్, నరేష్, వీరేంద్ర ప్రసాద్, అబ్దుల్ ఆలం, వినోద్‌కుమార్, సాయికుమార్, రమణయ్య, ప్రతిభా భారతి, మంజునాథ్, ఉమా మహేష్, వంశీ, హరికృష్ణ, సోము, నాని, ఓబులేషు, బాలకృష్ణ, పవన్, రారాజు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రార్ నియామకాన్ని రద్దుచేసిన హైకోర్టు

**బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి):** మైసూరు విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం రిజిస్ట్రార్ డాక్టర్ కెఎం మహదేవన్ ఉండగానే ముఖ్యమంత్రి సూచించడంతో బసప్ప అనే ఉద్యోగిని అదే స్థానానికి నియమించారు. సదరు నియామకాన్ని హైకోర్టు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన డాక్టర్ మహదేవ్ దాఖలు చేసుకున్న పిటీషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ బీఎం శ్యాంప్రసాద్ విభాగం ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేసింది. బసప్ప పరీక్షల విభాగం రిజిస్ట్రార్‌గా నియమించేందుకు అర్హులు కారని కులపతి ఇచ్చిన అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని ఆదేశాలను జారీ చేసినట్లు ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రభుత్వ సాధారణ ఉద్యోగుల తరహాలో యూనివర్సిటీలలో పదాధికారులను నియమించడం, ఉద్యోగులను తొలగించేందుకు అవకాశం లేదని ఆదేశాలలో స్పష్టం చేశారు. యూనివర్సిటీల్లో కార్యనిర్వహణాధికారులను ఉన్నఫళంగా తొలగిస్తే కోర్టులు జోక్యం చేసుకునేందుకు వీలుందని అభిప్రాయపడ్డారు. నియామకాన్ని పాలనాపరమైన విధానాలు పాటించలేదని పిటీషనర్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు సీఎం సూచన మేరకు బసప్పను నియమించారనే విషయం స్పష్టం చేసింది. కెఎం మహదేవన్ పరీక్షల విభాగం రిజిస్ట్రార్‌గా 2023 మార్చి 3న నియమితులయ్యారు. 2024 మార్చి 15న అదే విశ్వవిద్యాలయ రసాయనశాస్త్రం హెచ్‌ఓడీ బసప్పను నియమించారు. మహదేవన్ కోర్టును ఆశ్రయించడంతో బసప్పకు అర్హత లేదనే కారణంతో హైకోర్టు ధర్మాసనం రద్దుచేసింది.

## రేణుకాస్వామి హత్యకేసులో..

# మౌనం వీడిన సుమలత

- ఆ కుటుంబానికి సంతాపం
- దర్శన్ అలాంటి వ్యక్తి కాదని కితాబు
- సోషల్ మీడియాలో వివరణ

**బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి):** చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్యకేసులో దాదాపు నెలరోజులుగా మౌనంగానే ఉన్న ప్రముఖ సినీ నటి, మాజీ ఎంపీ సుమలత మౌనం వీడారు. నటుడు దర్శన్‌ను సుమలత పెద్దకొడుకుగా భావించేవారు. హత్యకేసులో దర్శన్ ఎ-2 నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మేరకు సుమలత ఏవిధంగా స్పందిస్తారనేది కుతూహలంగా ఉండేది. ప్రముఖ నటుడు దర్శన్ కేసులో ఇరుక్కుపోవడంతో అనుకూల వ్యతిరేక వాదనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ మేరకు గురువారం సుమలత సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘ వివరణ ఇచ్చారు. 44 ఏళ్లుగా నటిగాను, ప్రజాజీవనంలో ఎన్నోఏళ్లుగా ఉన్నానని, ఐదేళ్లు ఎంపీగా వ్యవహరించానని, అంబరీశ్ భార్యగా, అభిషేక్‌కు తల్లిగా ప్రతి బాధ్యతను గంభీరంగానే భావించానని అన్నారు. సమాజంలో అంశం ఏదైనా సమగ్ర సమాచారం లేకుండా మాట్లాడటం సరికాదని భావించానని తెలిపారు. ముందుగా కుమారుడిని కోల్పోయిన తల్లిదండ్రులు, రేణుకాస్వామిని కోల్పోయిన భార్యకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. తాను మౌనంగా ఉండటం వెనుక బాధ ఉందని అన్నారు. దర్శన్ స్టార్ కాక ముందు 25 ఏళ్ల నుంచి తెలుసు అన్నారు. అంబరీశ్‌ను అప్పాజీగా గౌరవించేవారని, తనను తల్లిగా భావించారని తెలిపారు. ఏ తల్లి కూడా కుమారుడిని ఇటువంటి పరిస్థితిలో చూడటాన్ని సహించరన్నారు. దర్శన్‌కు ఇలాంటి కృత్యాలు చేసే మనస్తత్వం లేదన్నారు. దర్శన్ భార్య విజయలక్ష్మితో పాటు కుమారుడి పట్ల సోషల్ మీడియాలో వచ్చిన పోస్టింగులు బాధ కలిగించాయన్నారు. ఇప్పటికే భయానక పరిస్థితిని ఎదుర్కొంటున్న వారి పట్ల కామెంట్లు వారి కుటుంబాలపై ఎంతటి ప్రభావం చూపుతాయనేది పరిగణించాలని పేర్కొన్నారు.

# తల్లీబిడ్డల ఆరోగ్యం సమాజానికి ముఖ్యం : ప్రియాంక ఉపేంద్ర

**బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి):** తల్లీబిడ్డల ఆరోగ్యం సమాజానికి ముఖ్యమని, ప్రతి ఆసుపత్రిలోనూ వారికి ప్రత్యేకంగా సౌలభ్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని ప్రముఖ నటి ప్రియాంక ఉపేంద్ర తెలిపారు. గురువారం రాజరాజేశ్వరినగర్‌లో 400 పడకల సామర్థ్యం కల్గిన తల్లీబిడ్డల స్పర్శ్ ఆసుపత్రిని ప్రారంభించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో గర్భధారణ, మహిళలకు సంబంధించిన అన్ని శస్త్రచికిత్సలు ఒకే చోట అమలు చేసేలాంటి అత్యాధునిక సదుపాయాలు, అనుభవం ఉన్న వైద్యనిపుణులు కేటాయించడం సంతోషకరమన్నారు. స్పర్శ్ గ్రూప్ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ శరణ్‌పాటిల్ మాట్లాడుతూ గర్భావస్థలో తలెత్తే సమస్యలను నివారించేందుకు ప్రత్యేకంగా ఆసుపత్రి ఉందన్నారు. మల్టిస్పెషాలిటీ విభాగంలో గైనకాలజీ, ఐవీఎఫ్ వంటి సదుపాయాలు తెచ్చామన్నారు.



ఆసుపత్రిలో తల్లీబిడ్డల ఫోటోను పరిశీలిస్తున్న నటి ప్రియాంక ఉపేంద్ర

# ఐదో ఆర్థిక కమిషన్ వ్యవధి పొడిగింపు

**బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ఐదో ఆర్థిక కమిషన్ వ్యవధిని వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పొడిగిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. గురువారం విధానసౌధలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. కేబినెట్ తీర్మానాలను శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వివరించారు. మత్స్యశాఖలో కాంట్రాక్టును ఏడాది పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీరాజ్, నగర పాలక సంస్థల ఎన్నికల విభాగాన్ని పాలనా సంస్కరణలకు కేటాయించేలా జస్టిస్ కె. భక్తవత్సల నివేదికను పాటించరాదని ప్రస్తుతం కొనసాగిస్తున్న విధానాన్ని పాటించాలని తీర్మానించారు. లోకాయుక్త సంస్థలో ఖాళీగా ఉండే కీలక పోస్టులకు ఆరుగురిని నియమిస్తూ తీర్మానించారు. సచివాలయ సేవల నియామకాలను సవరించారు. ప్రభుత్వ బీమాశాఖ ద్వారా 2018-20 ద్వైవార్షిక లాభాలను బోనస్‌గా ఇవ్వాలని నిర్ణయించారు. 563 నమ్మ క్లినిక్‌లను బలోపేతం చేసేందుకు ల్యాబ్‌లు, మందులను సమకూర్చనున్నారు. మందులు సమకూర్చేందుకు రూ.53.66 కోట్లకు అనుమతించారు. వంద పడకల సామర్థ్యం కల్గిన 7 తాలూకా ఆసుపత్రులలో నిర్మాణాలకు రూ.256.15 కోట్లకు ఆమోదం తెలిపారు. కర్ణాటక పరీక్షా ప్రాధికార భవనంలో సౌలభ్యాలు పెంచేందుకు రూ.30 కోట్లు కేటాయించారు. కొప్పళ జిల్లా తళకళ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్మాణాలకు రూ. 59.32 కోట్లకు ఆమోదించారు. చిక్కమగళూరు జిల్లా మామినకెరె గ్రామంలో 20 కుంటల భూమిని నారాయణగురు బిల్లవ సమాజ సంఘానికి మంజూరు చేశారు. బీఎంటీసీకి 840 బీఎస్6 బస్సుల ను కొనుగోలుకు అనుమతించారు. ఇందిరాక్యాంటీన్‌లో కిచెన్ కమ్ క్యాంటీన్‌ల నిర్మాణాలకు రూ. 74.5 కోట్లకు అనుమతులు ఇచ్చారు. 10 మహానగర పాలికెలలో మహాత్మాగాంధీ నగర వికాస యోజనె ఫేజ్ 2 పనుల అమలుకు రూ.2వేలకోట్లతో ఆమోదం తెలిపారు. ఇంకా పలు అంశాలను కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మైసూరు ముడాలో అవినీతి చోటు చేసుకుందనే అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది.

## ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి

● 'జలశక్తి అభియాన్'పై సమీక్షలో

సెంట్రల్ నోడల్ అధికారి అరులానందన్

**అనంతపురం టౌన్, జూలై 4:** ప్రతి వర్షపు నీటి బొట్టును వృథా కాకుండా ఒడిసి పట్టి భూగర్భజలాలను పెంచాలని డైరెక్టర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్‌కామర్స్, సెంట్రల్ అధికారి అరులానందన్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో 'జలశక్తి అభియాన్' అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అరులానందన్ మాట్లాడుతూ జలశక్తి కింద జిల్లాలో పనులు చేపట్టడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో నీటి లభ్యత పెరిగేలా పనులు చేపట్టాలన్నారు. కురిసిన వర్షపు నీటిని వృథా పోకుండాచూసి ఒడిసి పట్టి నీటి జలాలు పెరిగేలా చూడాలన్నారు. ఇంకుడు గుంతల వల్ల కూడా నీరునిల్వ ఉండి భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. జిల్లాలో మూడురోజుల పాటు జలశక్తి అభియాన్ కింద చేపట్టిన పనులను పరిశీలిస్తామని, ఇంకా నీటి లభ్యత పెరగడానికి ఎలాంటి పనులు చేపట్టాలో చూస్తామన్నారు. అనంతలో జల లభ్యత పెరగడానికి కృషి చేయాలన్నారు. అదికారులు సమష్టిగా పనిచేసి జిల్లా అబివృద్ధికి పాటు పడాలని కోరారు. కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరులను బలోపేతం చేయడమే లక్ష్యంగా మనమందరం పనిచేద్దామన్నారు. ఫారంపాండ్ పనులు, బ్లాక్ ప్లాంటేషన్ పనులు, ఐఈసీ యాక్టివిటీలను చేపట్టాలని అదికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సైంటిస్ట్ షరీఫ్‌ఖాన్, ఉన్నతాదికారులు పాల్గొన్నారు.

# బైక్, ట్యాక్సీలపై చర్యలు తీసుకోవద్దు

**బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి):** బైక్ ట్యాక్సీలపై చర్యలు తీసుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రైవేట్ రవాణా సంఘాల సమాఖ్య 32 ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. బెంగళూరు నగరంలోని 11 ఆర్టీఓల కార్యాలయాల పరిధిలో ఎలక్ట్రిక్ బైక్ ట్యాక్సీలపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ప్రైవేట్ ట్యాక్సీల సంఘాల పదాధికారులు స్థానిక శాంతినగర్ వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం రవాణాశాఖ కమిషనర్ యోగేశ్‌కు వినతి పత్రం సమర్పించారు.



నిరసనలో వివిధ సంఘాల పదాధికారులు

# రైల్వే అవినీతిపై సీబీఐ వల

● అదుపులో సీనియర్ డీఎఫ్ఎం సహా ఐదుగురు ● గుంతకల్లు డీఆర్ఎం కార్యాలయంలో రాత్రిదాకా విచారణ

**గుంతకల్లు, జూలై 4:** అనంతపురం జిల్లా గుంతకల్లు డివిజనల్ రైల్వే కార్యాలయంలో అవినీతి చేపలు సీబీఐ వలకు చిక్కాయి. కార్యాలయంలోని అకౌంట్స్ సెక్షన్‌లో అవినీతికి పాల్పడిన అధికారులను గురువారం సాయంత్రం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు, గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని కడప వద్ద రైల్వేవంతెన నిర్మాణ పనులు దక్కించుకున్న ఓ కాంట్రాక్టరును రైల్వే ఆకౌంట్సు శాఖ అధికారులు పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేశారు. ఈ పనులకు ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించగా, కడపకు చెందిన ఓ కాంట్రాక్టరు ఫ్రైజ్ బిడ్డర్ అయ్యారు. పనికి సంబంధించి ఆక్సెప్టెన్సీ లెటరును జారీ చేయడానికి సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజరు (సీనియర్ డీఎఫ్ఎం) కె.ప్రదీప్ బాబు, ఆఫీస్ సూపరింటెండెంటు బాలాజీ, ఇతర సిబ్బంది పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేశారు. సాధారణంగా ఇచ్చే డబ్బుకన్నా ఎక్కువ అడగటంతో సంబంధిత కాంట్రాక్టరు సీబీఐ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు గురువారం సాయంత్రం లంచం డబ్బును ఓ ఉద్యోగికి ఇచ్చాడు. అదే సమయంలో సీబీఐ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఈ అవినీతిలో ప్రమేయం ఉన్నట్లు భావిస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్ బాలాజీతోపాటు మరో ఇద్దరు ఉద్యోగులను అదుపులో తీసుకున్నారు. సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబు రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో జరుగుతున్న ఓ కార్యక్రమంలో ఉన్నారని తెలిసి.. అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ఆయనను డీఆర్ఎం కార్యాలయానికి తీసుకువచ్చారు. డీఆర్ఎం వినీత్ సింగ్ జోనల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో ఉండగా, అత్యవసరంగా పిలిపించి విషయాన్ని తెలియజేశారు. గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులకు కూడా సమాచారం అందజేశారు. ఆ తర్వాత డీఆర్ఎం సమక్షంలో అకౌంట్స్ శాఖ సిబ్బందిని మీటింగ్ హాల్‌కు రప్పించి, నిందితులను విచారించారు. సీనియర్ డీఎఫ్ఎం ఇంటికి రాత్రి 7 గంటల సమయంలో కొందరు సీబీఐ అధికారులు వెళ్లి, ఆయన సతీమణి నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంటిని సోదా చేసేందుకు ఇతర అధికారుల కోసం వేచి ఉన్నారు. డీఆర్ఎం కార్యాలయంలో సీబీఐ అధికారులు రాత్రి తొమ్మిది గంటల వరకూ విచారించారు. ఆ తర్వాత రిపోర్టు రాసే పనిలో పడ్డారు.



స్వాధీనం చేసుకున్న డబ్బుతో డీఆర్ఎం కార్యాలయంలోకి వెళ్తున్న సీబీఐ అధికారులు